# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, సోమవారం 23 జూన్ 2025 | RANGAREDDY





ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. కుటుంబసమేతంగా అటవీ అందాలను తిలకించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు. - ధారూరు, జూన్ 22




వికారాబాద్‌కు సమీపంలో ఉన్న అనంతగిరికి భక్తులు, పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం కావడంతో భక్తులు అధికంగా వచ్చి అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్నారు. అనంతరం సరదాగా గడిపారు. నంది‌ఘాట్ వద్ద, వ్యూ పాయింట్లలో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. - వికారాబాద్, జూన్ 22

**పెట్టుబడి సాయానికి దూరమైన 60 వేల మంది రైతులు**

# భరోసా ఇవ్వాల్సిందే..

**తొమ్మిది మండలాల్లో సాగు చేయడంలేదనే నెపంతో నిలిపివేసినసాయం**

- సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని అన్నదాతల ఆగ్రహం
- ఇప్పటికే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచి రెడ్డి కిషన్‌రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్ శివారులో అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, బాలాపూర్, గండిపేట్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్ మండలాలతో పాటు పలు మున్సిపాలిటీలు విస్తరించి ఉన్నాయని.. ఇక్కడెవరూ వ్యవసాయం చేయడం లేదని.. మొత్తం ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయన్న కారణంతో సర్కారు రైతు భరోసాను నిలిపివేశారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, శంకర్‌పల్లి, బాలాపూర్ మండలాలతోపాటు తుక్కుగూడ, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం తదితర మున్సిపాలిటీల్లో రైతులు వేలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అలాగే మిగతా మండలాల్లో కూడా కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం అసలు పంటలే సాగు చేయడం లేదనే సాకు చూపి రైతు భరోసాను పూర్తిగా నిలిపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ రైతు భరోసా ఇచ్చిన ప్రభుత్వం ఈ తొమ్మిది మండలాలపై ఎందుకు కక్ష సాధిస్తున్నదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం జిల్లాలో సాగుకు యోగ్యం కాని భూముల పేరుతో వేలాది ఎకరాలకు రైతు భరోసా నిలిపివేసింది. కొత్తగా మరో తొమ్మిది మండలాలను శివారు మండలాలుగా ముద్రవేసి సాయం నిలిపివేయడంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

- రంగారెడ్డి, జూన్ 22 (నమస్తే తెలంగాణ)



తులేకలాన్ గ్రామపంచాయతీ ఎదుట ఆదివారం ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు

### పెరుగుతున్న ఆందోళన.. పట్టించుకోని ప్రభుత్వం

శివారు మండలాల్లోని రైతులందరికీ వెంటనే రైతు భరోసా ఇవ్వాలని అన్నదాతలు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. శివారు మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున వరి, కూరగాయల పంటలు సాగవుతున్నప్పటికీ వ్యవసాయం చేయడం లేదన్న కారణంతో రైతు భరోసాను నిలిపి వేయడం సమంజసం కాదని, రైతు భరోసా నిలిపివేయడం వల్ల 60 వేల మందికి పైగా రైతులు నష్టపోతున్నారని, వెంటనే అర్హులైన రైతులను గుర్తించి రైతు భరోసా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు శివారు మండలాల్లోని రైతు భరోసాకు దూరమైన అన్ని గ్రామాల్లో ఆందోళన చేపట్టాలని బీఆర్ఎస్ సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా తులేకలాన్ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళనకు దిగి కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మరోవైపు బీజేపీ కూడా శివారు మండలాల్లోని రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యాచరణకు పిలుపునిచ్చింది. రైతు భరోసాకు దూరమైన రైతులందరినీ కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భావిస్తున్నది.



కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### వ్యవసాయ శాఖ ధ్రువీకరించినా..


రంగారెడ్డి జిల్లాలో రైతు భరోసా నిలిపివేసిన 9 మండలాల్లో సుమారు 60 వేల మంది రైతులు అర్హులని ప్రభుత్వమే గుర్తించింది. ఈ మండలాల్లో సాగు చేస్తున్న రైతుల వివరాలను ఇప్పటికే వ్యవసాయ శాఖ ధ్రువీకరించింది. సుమారు 48 వేల ఎకరాల్లో వరి ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారుల రికార్డుల్లో ఉన్నా రైతు భరోసాకు నోచుకోవడంలేదు. ఇటీవల శివారు మండలాల నుంచి పెద్దఎత్తున సర్కారు ధాన్యం కొనుగోలు చేసింది. అయినా పెట్టుబడి సాయం అందించడంలేదు.

### అర్హులందరికీ భరోసా ఇవ్వాల్సిందే..



అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాల్సిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చింది. కాంగ్రెస్ సర్కారు మాత్రం రైతు భరోసాలో ఎక్కడికక్కడే కోత విధిస్తున్నది. హైదరాబాద్ దగ్గరలో ఉన్న సాకుతో జిల్లాలో 9 మండలాల రైతులకు రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నది. రైతులు వరి, కూరగాయల పంటలు సాగు చేస్తున్నప్పటికీ ఆయా మండలాల్లో సాగు జరగడం లేదని ప్రభుత్వం ప్రకటించడం శోచనీయం. వెంటనే శివారు మండలాల్లోని అన్ని గ్రామాల రైతులకు రైతు భరోసా ఇవ్వాలి, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం.

- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## రాష్ట్ర పరువు తీస్తున్న రేవంత్

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

బడంగ్‌పేట, జూన్ 22 : సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర పరువు తీస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. మహేశ్వరం మండలంలోని మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత మర్యాద రాఘవేందర్‌రెడ్డితో పాటు వందలాది మంది కార్యకర్తలు ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సభాస్థలికి వచ్చి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అధికారం కోసం అమలుకాని హామీలిస్తూ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని బజారుకు ఈడుస్తున్నారన్నారు. పింఛన్లను రూ.నాలుగు వేలకు పెంచకుండా.. మహిళలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అర్హులకు ఇప్పటికి కూడా రేషన్ కార్డు రాలేదని ఎద్దేవా చేశారు. కొత్త పింఛన్లు ఎంతమందికి మంజూరు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని రైతు భరోసా వేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.

### కాంగ్రెస్‌పై ప్రజల్లో ఆగ్రహం

రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగా ఉన్నదని.. వ్యవసాయ భూములే లేవని సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీని నిలిపేయడంపై ఆమె మండిపడ్డారు. గత బీఆర్ఎస్ హయాంలో రూ.159 కోట్లను ఒక మహేశ్వరం మండలానికే అందినట్లు ఆమె గుర్తు చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో రైతు భరోసాను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. అందుకే ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజూనాయక్, పాండుయాదవ్, వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## అన్నదాత పొట్టకొట్టొద్దు

- శివారు ప్రాంతాల అన్నదాతలకు రైతు భరోసా అందించాలి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి
- తులేకలాన్ పంచాయతీ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

ఇబ్రహీంపట్నం : భూమిని నమ్ముకుని జీవిస్తున్న అన్నదాత పొట్టకొట్టొద్దని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తులేకలాన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు పొందిన రైతులకు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందించకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. శివారు ప్రాంతాల్లో ఇప్పటికీ వేలాది మంది రైతులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారని.. వారిని ఇబ్బందులపాలు చేయడం సరైనది కాదని హెచ్చరించారు. కూరగాయలు ఇతరత్రా పంటలను సాగు చేసి నగరానికి తీసుకెళ్లి విక్రయించే అన్నదాతల పొట్టగొట్టడం తగదన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులందరికీ రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు రైతులందరికీ పెట్టుబడి సాయం పంపిణీ చేసే వరకు రేవంత్ సర్కార్‌పై పోరాటం చేస్తామని హెచ్చరించారు. హామీల అమల్లో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్నదాతను గోస పెడుతున్న సర్కారుకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన శాస్తి జరుగుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను తులేకలాన్ చౌరస్తాలో దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్న మండలాధ్యక్షుడు బుగ్గరాములు, సహకార సంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, ఉత్తమ రైతు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, నాయకుడు రాజు పాల్గొన్నారు.




# నర్సరీల్లోనే మొక్కలు

- ఇంకా ఖరారు కాని వనమహోత్సవం ప్రారంభ తేదీ
- మొక్కలను పెంచేందుకు ఒక్కో నర్సరీకి రూ.1.20 లక్షలను ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- ఈ ఏడాది 40.59 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- జిల్లావ్యాప్తంగా 580 నర్సరీల్లో మొక్కలు సిద్ధం
- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 566 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో, అటవీ శాఖ పరిధిలోని 14 నర్సరీల్లో ఔషధ మొక్కలు సిద్ధం

వికారాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : గత కేసీఆర్ ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రతి ఏటా తెలంగాణకు హరితహారం కింద మొక్కలు నాటి వాటిని సంరక్షించేది. ప్రతిఏటా జూన్ మొదటి వారంలోనే హరితహారం కార్యక్రమ ప్రారంభ తేదీలను ఖరారు చేసి జూన్ రెండో వారంలోనే మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టేది. కాంగ్రెస్ సర్కార్ మాత్రం హరితహారం లాంటి కార్యక్రమాలను కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. మొక్కలు నాటే కార్యక్రమానికి ఇంకా ప్రారంభ తేదీని ఖరారు చేయకపోవడంతో నర్సరీల్లోనే మొక్కలు వృథాగా పడి ఉన్నాయి. ఆలస్యం చేస్తుండడంతో మెయింటెనెన్స్‌కూ ఖర్చు చేయాల్సి వస్తున్నదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఆలస్యమైతే నర్సరీల్లోని చాలా వరకు మొక్కలు వృథా అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం పేరును కాంగ్రెస్ సర్కార్ వనమహోత్సవంగా పేరు మార్చిన విషయం తెలిసిందే. మరోవైపు మొక్కలు నాటేందుకు ఈ నెల మొదటి వారం నుంచే గుంతలు తీసే ప్రక్రియ ప్రారంభం కాగా, కొన్ని చోట్ల తీసిన గుంతలు మూసుకుపోయే పరిస్థితులున్నాయి. కాగా, మొక్కలను పెంచేందుకు ఒక్కో నర్సరీకి రూ.1.20 లక్షల చొప్పున ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో 580 నర్సరీల్లో మొక్కలను పెంచారు. వాటిలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల్లో 566 నర్సరీల్లో 49 లక్షలు, అటవీ శాఖ ఆధ్వర్యంలోని 14 నర్సరీల్లో 17 లక్షల మొక్కలు ఉన్నాయి.

### ఈ ఏడాది లక్ష్యం.. 40.59 లక్షలు

గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ తెలంగాణకు హరితహారం కార్యక్రమం పేరు మార్చడంతోపాటు మొక్కలను నాటే కార్యక్రమంపైనా నిర్లక్ష్యం చేస్తున్నది. ఈ ఏడాది జిల్లాలో నాటాల్సిన మొక్కలకు సంబంధించి లక్ష్యాన్ని భారీగా తగ్గించింది. పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన మొక్కలు నాటే కార్యక్రమంపై శీతకన్ను చూపడంపై జిల్లాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది జిల్లాలో 40.49 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టుకోగా.. ఈ ఏడాది కేవలం 10 వేల మొక్కలను మాత్రమే పెంచి 40.59 లక్షల మొక్కలను నాటాలని నిర్ణయించారు.

జిల్లాలో 'తెలంగాణకు హరితహారం'లో భాగంగా 2015-16లో 73,78,000., 2016-17లో 1,39,00,000., 2017-18లో 71,04,000., 2018-19లో 86,12,000., 2019-20లో 1,02,00,000., 2021-22లో 74,00,000., 2022-23లో 40.25 లక్షల మొక్కలను జిల్లాలో నాటారు.

## ఆరు నెలలు కావస్తున్నా

# అందని వేతనాలు

- విలీన గ్రామాల కార్మికులు పనిచేసేది మున్సిపాలిటీలో.. వేతనాలు పంచాయతీరాజ్‌శాఖలో..!
- సమస్యల పరిష్కారంపై అధికారుల ధ్యాస కరువు




పరిగి, జూన్ 22 : మున్సిపాలిటీలో గ్రామాలు విలీనమైతే తమ దశ మారుతుందనుకుంటే అయిదు నెలలుగా చిరుద్యోగులకు కనీస వేతనాలు కరువయ్యాయని కార్మికులు వాపోతున్నారు. మరోవైపు పేరుకే విలీనమైనా పంచాయతీరాజ్ ఉద్యోగులను మున్సిపల్ పరిధిలోకి మార్చకుండా పనిచేయిస్తుండడం గమనార్హం. వీటికితోడు విలీన గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ చూపడంలేదు. 2018లో పరిగి మున్సిపాలిటీగా ఏర్పడగా.. ఐదేండ్ల పదవీ కాలం పూర్తైన తర్వాత 2025 జనవరి 28న అయిదు కిలోమీటర్ల పరిధిలోని ఆరు గ్రామాలు నస్కల్, శాఖాపూర్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, నజీరాబాద్, సయ్యద్‌మల్కాపూర్‌లను పరిగి మున్సిపాలిటీలో విలీనం చేస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు గ్రామాలకుగాను శాఖాపూర్‌లో కేవలం భూములు మాత్రమే ఉంటాయి. మిగతా అయిదు గ్రామపంచాయతీలు కాగా, అందులో పనిచేసే వర్కర్లను సైతం మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల తర్వాత ఆయా గ్రామపంచాయతీలలోని రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల వివరాలను తీసుకొని ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో గత జనవరి 28 నుంచి ఆరు గ్రామాలు పరిగి మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చాయి.

### విలీన గ్రామాల్లో సమస్యలు యథాతథం

మరోవైపు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో సమస్యలు యథాతథంగా ఉంటున్నాయి. ప్రధానంగా వీధి దీపాలు పని చేయకుంటే మరమ్మతు చేయించేవారు కరువయ్యారని, కొత్త వీధి దీపాల ఏర్పాటు ముచ్చటే లేదని ఆయా గ్రామాలవారు పేర్కొంటున్నారు. ఒక్కోసారి వీధి దీపాలు పనిచేయకుంటే పదిహేను రోజుల వరకు మరమ్మతు చేయించడం లేదని తెలిపారు. అలాగే పారిశుధ్య సమస్య, దోమల నివారణకు సంబంధించి ఫాగింగ్ సైతం చేయడం లేదని విలీన గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తమ గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. తమ గ్రామాల నుంచి ఆదాయం కావాలి కాని సమస్యలు పరిష్కరించరా అని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

### పనులు చేయిస్తున్నారు.. వేతనాలివ్వడంలేదు

పరిగి మున్సిపాలిటీలో విలీనమైన అయిదు గ్రామపంచాయతీల పరిధిలో పనిచేస్తున్న కార్మికులు తమ గ్రామాల విలీనంతో తమకు ఠంచనుగా వేతనం వస్తుందని, అధికంగానే వేతనం రాబోతుందని ఆశించారు. కానీ మున్సిపాలిటీలో విలీనమై ఆరు నెలుల కావస్తున్నా ఇప్పటివరకు వారికి వేతనాలు ఇవ్వకపోవడం విడ్డూరం. నస్కల్ గ్రామపంచాయతీలో 8 మంది, రుక్కుంపల్లిలో ముగ్గురు, సయ్యద్‌మల్కాపూర్‌లో ముగ్గురు, నజీరాబాద్‌లో 7 మంది, సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీలో 6 మంది కార్మికులు మొత్తం 27 మంది పనిచేస్తున్నారు. వారికి ఇప్పటివరకు ఒక నెల వేతనం సైతం రాకపోవడం గమనార్హం. గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికులకు మార్చి నెల వరకు వేతనాలు వచ్చాయి. పనిచేస్తే కాని పూట గడవని కుటుంబాలకు చెందిన కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సగటు వేతన జీవికి ఒక నెల వేతనం ఆలస్యంగా వస్తేనే తల్లడిల్లుతారు. అలాంటిది పేద కుటుంబాలకు చెందిన చిరుద్యోగులకు వేతనాలు అందించడంలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. ఆయా గ్రామాల్లో పారిశుధ్యం, ఇతర పనులు చేయిస్తున్నారు తప్ప వేతనాలు ఇవ్వడంలో ఆరు నెలల తాత్సారం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల కార్మికులకు వేతనాలు ఇస్తున్నట్లు తెలిసింది. పరిగి మున్సిపాలిటీలో ఎందుకు ఇవ్వడం లేదని, ఇప్పటికైనా వెంటనే విలీన గ్రామాల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### పని మున్సిపాలిటీలో.. వేతనం పంచాయతీరాజ్‌లో..!

విలీన గ్రామపంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శుల సమస్య మరోలా ఉన్నది. గతంలో మున్సిపాలిటీలోకి విలీనమైన గ్రామపంచాయతీ కార్యదర్శులు మున్సిపాలిటీలో పనిచేస్తారా, లేక గ్రామపంచాయతీలో పనిచేస్తారా అని ఆప్షన్ అడిగి మున్సిపాలిటీలో పనిచేసేందుకు అంగీకరించిన వారిని వెంటనే మున్సిపల్ శాఖలోకి తీసుకొని, వారి సర్వీసును అలాగే కొనసాగించేవారు. పరిగి మున్సిపాలిటీలో విలీనమైన గ్రామపంచాయతీల కార్యదర్శులు తాము మున్సిపాలిటీలో కొనసాగుతామని రాసిచ్చారు. ఈమేరకు గత ఆరు నెలలుగా వారు మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లోనే పనిచేస్తున్నా వేతనాలు పంచాయతీరాజ్ శాఖలో తీసుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శులను మున్సిపల్ శాఖ పరిధిలోకి పంపించేందుకు సంబంధించి ఆ శాఖ కమిషనర్ నిర్ణయం తీసుకోకపోవడం, తమ దగ్గర సిబ్బంది సరిపోను లేరంటూ వారిని మున్సిపల్ శాఖ పరిధిలోకి పంపించేందుకు ఆలస్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కార్యదర్శులతో అనామకంగా పనిచేయించడం తప్ప పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించలేని పరిస్థితి నెలకొన్నది. తమ శాఖ పరిధిలోకి వస్తే వార్డు అధికారులుగా, ఇతర అధికారులుగా బాధ్యతలు పూర్తిస్థాయిలో అప్పగించవచ్చని, శాఖ పరిధిలోకి రానపుడు కచ్చితమైన పని చేయించలేకపోతున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.